

థ్రైవ్ ఎనర్జీ టెక్నాలజీస్ సంస్థ అధినేత డాక్టర్ రంగనాయకులు

# చీకట్లో.. చిరు దీపం

**ప్రపంచబ్యాంక్ ఉద్యోగం వదిలి సోలార్ లైట్ల తయారీకి..**

**స్వచ్ఛందసంస్థ ఏర్పాటు చేసి పలు దేశాలకు ఉచితంగా పంపిణీ**

**వెల్లువెత్తిన అవార్డులు**

**వెలుగు వెనుక నీడ ఉన్నట్లే వెలిగిపోతున్న అభివృద్ధిని చీకటి అనుసరిస్తూనే ఉంది. అభివృద్ధి నాణేనికి రెండో వైపు ఉన్న ఈ చీకటిపై యుద్ధం ప్రకటించాడో ఉద్యోగి. ప్రపంచ బ్యాంక్‌లో ఉద్యోగాన్ని వదులుకుని నూనె దీపాల గుడ్డి వెలుగులో చదివే పిల్లలకు, కరెంటు కోతలతో వ్యాపారాలు చేయలేక వెతలుపడే పెద్దలకు ఆయన కృషి వెలుగునిచ్చింది. చీకటి దారుల్లో పయనించిన ఈ పారిశ్రామిక కాంతి రేఖ వేలాది ఇళ్లలో ప్రకాశిస్తూ, లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపుతోంది!**

చర్లపల్లి :

మనిషికి గాలి, నీరు, తిండి, బట్టతో పాటు వెలుగూ అవసరమే. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది రాత్రి వేళల్లో చీకటిలోనే జీవితాల్ని వెళ్లదీస్తున్నారు. మన దేశంలో సుమారు 15 కోట్ల మంది విద్యార్థులు విద్యుత్ వెలుగు లేక చీకటిలో ఇబ్బంది పడుతున్నారు. కొందరి జీవితాల్లోనైనా వెలుగులు నింపాలనే ధ్యేయంతో ఉన్నత ఉద్యోగం వదిలిపెట్టి సోలార్ రంగంలో ఓ పరిశ్రమ స్థాపించి గడిచిన పది సంవత్సరాల కాలంలో కొన్ని లక్షల సోలార్‌లైట్లను తయారు చేసి అందజేసిన ఘనత బోడావుల రంగనాయకులకే దక్కింది. ప్రకాశం జిల్లా చీరాల సమీపంలోని తిమిదెడపాడు గ్రామంలో పుట్టి పెరిగిన రంగనాయకులు ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఎంబీఏ పట్టా తీసుకున్నాడు. అనంతరం ఆయన హైదరాబాద్‌లో అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ కాలేజీలో ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్‌లో పీహెచ్‌డి పట్టానందుకున్నాడు. ఆ తరువాత ఆయనకు హార్వర్డ్ యూనివర్సిటీలో ఫెలోషిప్ లభించింది.హైదరాబాద్‌లో నివాసముంటున్న రంగనాయకులుకు ప్రపంచ బ్యాంక్‌లో ఉద్యోగం లభించింది. అక్కడ ఉద్యోగం చేస్తున్న సమయంలో ఆయన చీకట్లో మగ్గుతున్న పల్లెలు, విద్యుత్ దీపానికి నోచుకోని పూరిగుడిసెలు చూసి చలించారు. సాయంత్రం కాగానే అంధకారం అలుముకునే మారుమూల ప్రాంతాలతో పాటు రైతుకు బాసటగా ముందుకువచ్చి సోలార్ థ్రైవ్ ఎనర్జీ టెక్నాలజీస్ సంస్థ స్థాపించడంతో పాటు 'వన్ చైల్డ్ వన్ లైట్' ట్రస్టీని స్థాపించి ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా 27లక్షల సోలార్ విద్యుత్ దీపాలను అందజేశాడు.

### రంగనాయకులను వరించిన అవార్డులు..

మన దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా అనేకదేశాల్లో థ్రైవ్ సోలార్ లైట్లను అందించడంతో పలు అవార్డులు వరించాయి. ముఖ్యంగా 2006లో ప్రపంచబ్యాంక్ డెవలప్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అవార్డు, 2008లో లైటింగ్ ఆఫ్రికా, 2009సంవత్సరంలో లైటింగ్ టాంజానీయా, 2011సంవత్సరంలో ఫ్రాస్ట్ సులివాన్ ఎల్ఈడి ఎక్సలెన్స్ అవార్డు, 2012సంవత్సరంలో సీఎన్ఎన్-ఐబీఎన్ అవార్డులు పొందారు. ఆయనకు ఇచ్చి సత్కరించారు. ఇవేకాకుండా మన దేశంలోని పలు రాష్ట్ర ప్రభుత్వలతో పాటు స్వచ్ఛంద సంస్థలు పలు పురస్కారాలను అందించి సత్కరించారు. దేశవ్యాప్తంగా వచ్చే అమితాబ్ బచ్చన్ కార్యక్రమంలో అవకాశం రావడం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు.

**పరిశ్రమ ఏర్పాటుకు దారి తీసిందిలా...**

పదిహేను సంవత్సరాల క్రితం ప్రపంచ బ్యాంకు ఉద్యోగిగా ఉజ్బెకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్, కజకిస్తాన్, కెన్యా, టాంజానియా, ఉగాండా, ఘనా వంటి దేశాల్లో పనిచేశారు డాక్టర్ రంగనాయకులు. ప్రపంచ బ్యాంక్ ఉద్యోగిగా పనిచేస్తున్న కాలంలో కొన్ని దేశాలు యుద్ధాన్ని ఎదుర్కొన్నాయి. అంతర్గత సంక్షోభాల వల్ల కొన్ని దేశాలో పాఠశాలలు మూసివేశారు. ఈ పరిస్థితుల్లో.. ఆయా దేశాల్లో స్కూళ్లను పునరిద్ధరించడంతో పాటు విద్యార్థులకు చదువుకునే అవకాశం కల్పించడానికి ప్రయత్నించారు. కొన్ని సందర్భాల్లో విద్యార్థులు హోంవర్క్ సరిగ్గా చేయకపోవడం గమనించిన రంగనాయకులు దానికి కారణం వారికి విద్యుత్ సౌకర్యం లేకపోవడమే అని గుర్తించాడు. కాగా అక్కడ నివసిస్తున్న వారు కిరోసిన్ దీపాలు వాడుతుండడం, కిరోసిన్‌కు సైతం సబ్సిడి ఇవ్వకపోవడంతో ఆర్థికంగా భారమవుతున్నట్లు గమనించాడు. దీంతో వెంటనే విద్యుత్ అవసరం లేకుండా సౌరశక్తితో వెలిగే చిన్న దీపాలను తయారు చెయ్యాలనే సంకల్పంతో థ్రైవ్ సోలార్ సిస్టమ్స్ సంస్థను స్థాపించారు.

**సేవా భావంతో ట్రస్టీ ఏర్పాటు**

వచ్చిన అలోచనకు పదనుపెట్టి నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపాలన్న ఆశయంతో పరిశ్రమను స్థాపించారు. దీంతో పదిహేను లక్షల జీతం వదులుకోని చర్లపల్లిలో సోలార్ పరిశ్రమను స్థాపించి దేశంతో పాటు విద్యుత్ దీపాలకు నోచుకోని టాంజనీయా, ఘనా, నైజీరియా, కెన్యా, మాలవి, ఉగండా, రువాండ, ఆఫ్ఘనిస్థాన్, కంబోడియా, ఫిలిప్పైన్స్, నేపాల్, శ్రీలంక, బర్మా, భూటన్ వివిధ దేశాలకు చెందిన మారుమూల ప్రాంతాల్లో ఈ సోలార్ లైట్లను స్కూల్స్, వివిధ స్వచ్ఛంద సంస్థలకు అందజేయడం ప్రారంభించారు. దీంతో పలు దేశాల్లో ఈ సోలార్ ఉత్పత్తులకు మంచి అదరణ లభించింది. దీంతో డాక్టర్ రంగనాయకులు మరో అలోచన లేకుండా సోలార్ దీపాల ద్వారా వచ్చిన లాభాలను ఇతర వాటికి మళ్ళించకుండా వన్ చైల్డ్ వన్ లైట్ పేరుతో ట్రస్ట్ స్థాపించారు. ఈ ట్రస్ట్ దేశంలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళ నాడు,



బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, మణిపూర్, మహారాష్ట్ర వంటి ఎన్నో రాష్ట్రాలతో పాటు విదేశాల్లో స్వచ్ఛంద సంస్థలతో కలిసి సోలార్ ఎల్ఈడి లైట్లను ఉచితంగా పంపిణి చేయ్యడం ప్రారంభించింది. కాగా ఈశాన్య భారతదేశంలో ఇప్పటికీ 70శాతం గ్రామాలు గ్రిడ్ వ్యవస్థకు అనుసంధానం లేకపోవడంతో కిరోసిన్ దీపాలపై అధారపడుతున్నట్లు గమనించిన రంగానాయకులు వెంటనే స్వయం సహాయక బృందాలతో కలిసి సోలార్ దీపాలను పంపిణి చేస్తున్నారు. థ్రైవ్ సోలార్ సిస్టమ్ దీపాలకు పరిమితం కాకుండా మొబైల్ చార్జర్లు, వ్యవసాయానికి వినియోగించే 5హెచ్‌పీ పంపుసెట్ల వరకు అన్ని రకాల సోలార్ ఉత్పత్తులను తయారు చేస్తున్నారు.

**ప్రారంభంలో ఒడిదుడుకులు**

ప్రపంచ బ్యాంక్ ఉద్యోగిగా బాధ్యతలు చేపడుతున్న సమయంలో సోలార్ దీపాలను అందించాలనే లక్ష్యంతో ముందుకు వచ్చిన డాక్టర్ రంగానాయకులు అదిలోనే ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్నారు. ముడిసరుకుతో పాటు పెట్టుబడి, కావాల్సిన సౌకర్యాల విషయంలో ఎన్నో అవాంతరాలు ఎదుర్కొన్నారు. మొదట్లో ఉద్యోగం మానివేయ్యడంతో వచ్చిన డబ్బులతో చర్లపల్లి పారిశ్రామిక వాడల్లో పరిశ్రమను ఏర్పాటు చేసి ముందుగా యుద్ధంలో అన్నీ కోల్పోయిన వారికి ఉచితంగా సోలార్ దీపాలను అందించడం మొదలుపెట్టారు. దీంతో పాటు దేశంలోని మారుమూల ప్రాంతాలను గుర్తించి సౌరశక్తి దీపాలను అందించారు. ఇవి పాడైపోతే పారవేయకుండా రిపేరు చేసి ఇచ్చేందుకు ప్రణాళికలు తయారు చేసి అమలు చేశారు. అప్పట్లో యూపీఏ ప్రభుత్వం సైతం రంగనాయకుల అసక్తి గమనించి రాహుల్‌గాంధీ ఆయనకు సహకారం అందించడంతో రాయ్‌బరేలి, అమేధీ వంటి నియోజకవర్గల్లో కొన్ని వేల కుటుంబాలకు సోలార్ దీపాలను అందించారు. దీంతో అప్పటి నుంచి వెనుతిరిగి చూడకుండా అనుకున్న ఆశయానికి చేరుకున్నారు.

**పరిశ్రమతో వందలాది మందికి ఉపాధి**

థ్రైవ్ ఎనర్జీ సిస్టమ్ పరిశ్రమ ద్వార వందలాది మంది స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల వారికి ఉపాధి అవకాశం కల్పించారు. ముఖ్యంగా రానున్న రోజుల్లో సోలార్ కీలకం కానున్న తరుణంలో వందలాది మందికి పరిశ్రమలోనే శిక్షణలు ఇచ్చి వారిని మరింత ప్రోత్సహించడంతో పాటు ఆయా జిల్లాలో డిస్ట్రిబ్యూటర్లగా అవకాశం కల్పిస్తున్నారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సోలార్‌ను విస్తరించాలనే ధ్యేయంతో ఇప్పటికే ఉద్యోగులుగా చేరిన వారికి అవకాశం కల్పిస్తూ వారికి జిల్లాలో సోలార్‌పై అవగాహన కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నారు. వచ్చే సంవత్సరం నాటికి చౌకగా సోలార్ దీపాలను అందించేవిధంగా కృషి చేస్తున్నామని రంగనాయకులు పేర్కొన్నారు.



సోలార్ వెలుగులతో చదువుకుంటున్న విద్యార్థిని

**వీధిదీపాల నిర్వహణకు సిద్ధం..**

తెలంగాణలో సోలార్ వీధిదీపాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని డాక్టర్ రంగనాయకులు పేర్కొన్నారు. ఇప్పటికే మెదక్ జిల్లాను దత్తత తీసుకున్నామని, కలెక్టర్ అదేశాల మేరకు నలభై గ్రామాల్లో వీధిదీపాల నిర్వహణకు చర్యలు తీసుకున్నామన్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, అస్సాం, మణిపూర్, మేఘాలయ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, జార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు సోలార్ దీపాలు అందిస్తున్నామని, దీని ద్వారా వచ్చే లాభాలను ట్రస్ట్‌కు మళ్లిస్తున్నామన్నారు. రాబోయే ఇరవై సంవత్సరాల్లో ప్రపంచం మొత్తం సోలార్‌పై అధారపడాల్సిన పరిస్థితి నెలకొంటుందన్నారు.



సోలార్ దీపం వెలుగులో బట్టలు నేస్తున్న దృశ్యం



'వన్ చైల్డ్ వన్ లైట్' ట్రస్టీ ద్వార అందించిన సోలార్ దీపాలతో చిన్నారులు



ఆలోచనలు.. ఆచరణ రూపం దాల్చడానికి అనువైన వాతావరణం ఒకటి కావాలి. ఏదైనా పని ఆరంభించాలంటే.. ప్రాథమిక అవసరాలు తప్పనిసరి. సృజనాత్మక ఆలోచనలతో ముందడుగు వేస్తున్న యువతకు చేయూతనిస్తూ తెలంగాణ ప్రభుత్వం టీహబ్‌ని ప్రారంభించింది. వందలాది స్టార్టప్ కంపెనీలను ఒక గొడుగు కిందకు చేర్చే వేదిక. అది యువతలో కొత్త ఉత్సాహాన్నిచ్చిందనే చెప్పాలి. అలాంటి ప్రయత్నంలో భాగంగానే నగరంలో మరో వర్క్‌స్పేస్ వెలిసింది. '91 స్ప్రింగ్ బోర్డ్' పేరుతో తాజాగా కావూరి హిల్స్‌లో ప్రారంభించిన కో సెంటర్ స్టార్టప్‌లకు కావలసిన అన్ని రకాల సదుపాయాల్ని అందిస్తోంది.

# ఆవిష్కరణలకు.. అనువైన వేదిక

వర్క్‌స్పేస్ ఫర్ స్టార్టప్స్

సమావేశ మందిరాలు, కెఫెటేరియా

ఆలోచన ఉంటే చాలు ఆఫీస్ సెటప్ రెడీ

వాడటాన్ని బట్టి చార్జీలు

300 మంది కెపాసిటీ

సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ :

కొత్తగా ఓ స్టార్టప్ ప్రారంభించాలంటే ముందు ఆఫీస్ కావాలి. ఫర్నిచర్, కంప్యూటర్లు, ఇంటర్నెట్ ఇలా... చాలా అవసరాలే ఉంటాయి. అన్ని వసతులు సమకూర్చుకునే అవకాశం లేనప్పుడు ముందుకు వెళ్లడం ఎలా? అనే సందేహం తలెత్తుతుంది. అలాంటి వాళ్లకోసమే ప్రారంభమైంది 91 స్ప్రింగ్ బోర్డ్. మీ వద్ద ఆలోచన ఉంటే... తాపీగా వెళ్లి మీ ఆలోచనల్ని ఆచరణలోకి మలచుకోవచ్చు. అందుకు అవసరమైన అన్ని వసతులు అక్కడ అందుబాటులో ఉంటాయి. మీరు ఆఫీస్‌గా మలుచుకునేందుకు అనువైన వాతావరణం ఉంటుంది. ఫర్నిచర్, ఇంటర్నెట్, కెఫెటేరియా, కాన్ఫరెన్స్ హాల్స్ ఇలా సకల సదుపాయాలు ఉంటాయి. మీ అవసరానికి తగిన రెంట్ పే చేసి వాటిని వినియోగించుకోవచ్చు.



**ఆలోచనతో...**

హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా అభివృద్ధి చేసే క్రమంలో ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. అందుకు తగినట్లుగానే పలు మల్టీనేషనల్ సంస్థలు నగరంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి. దానికి సమాంతరంగా యువత వేర్వేరు రంగాల్లో స్టార్టప్స్‌ని ప్రారంభించేందుకు ముందుకువస్తోంది. అలాంటి యువతకు సహకరించేందుకు ప్రభుత్వం టీ హబ్‌ని ప్రారంభించింది. వందలాది స్టార్టప్ సంస్థలు ఒకే చోటు నుంచి పనిచేసుకునేందుకు వీలు కల్పించింది. ఇప్పుడు అలాంటి మరో సంస్థ 91 స్ప్రింగ్ బోర్డ్.. స్టార్టప్‌లకు మరో మంచి అవకాశాన్ని కల్పిస్తోంది. ఎలాంటి ఏర్పాట్లు లేకున్నా.. నేరుగా తమ పనుల్ని ప్రారంభించుకోవచ్చు. తమ ఆలోచనల్ని ఆచరణలోకి మలుచుకోవచ్చు. అవసరమైన అన్ని ఏర్పాట్లు ఈ సంస్థ కల్పిస్తుంది. అంతే కాదు.. మూడు నెలలకోసారి స్టార్టప్ ఓపెన్ అవర్ పేరుతో... ఇన్వెస్టర్లను ఆహ్వానించి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నది.

**20వేల అడుగుల విస్తీర్ణం**

ఈ కో-వర్క్ స్పేస్‌ని రెండేళ్ల క్రిందట ఢిల్లీలో ప్రారంభించారు. ప్రస్తుతం వందకుపై స్టార్టప్స్ అక్కడ పనిచేస్తున్నాయి. తరువాత బెంగళూరు, కేరళలో ప్రారంభించిన 91 స్ప్రింగ్ బోర్డ్.. తాజాగా నగరంలోని కావూరి హిల్స్‌లో తన శాఖను ప్రారంభించింది. ఈ కోవర్క్ స్పేస్ నుంచి స్టార్టప్ సంస్థలు తమ కార్యాలయాలను నిర్వహించుకోవచ్చు. నెలలు, లేదా రోజుల చొప్పున అద్దె చెల్లించి ఈ స్పేస్‌ని వినియోగించుకోవచ్చు. రూ.3000 నుంచి 7000 వరకు ఆయా వినియోగాన్ని బట్టి చార్జీలు వర్తిస్తాయి. 20వేల చదరపు అడుగుల వైశాల్యంలో ఐదు అంతస్తుల్లో గల ఈ హబ్‌లో 300 మంది సిట్టింగ్ కెపాసిటీ గల వర్క్ స్టేషన్స్ ఉన్నాయి. ప్రస్తుతం ఇక్కడ 120 మంది వరకు వర్క్ చేస్తున్నారు.

**అన్ని వసతులు**

కాన్ఫరెన్స్ హాల్స్, హై స్పీడ్ ఇంటర్నెట్‌తో పాటు ప్రొజెక్టర్స్, స్టోరేజీ లాకర్స్, జిరాక్స్, కెఫెటేరియా, స్పోర్ట్స్ లాంజ్ ఇలా అన్ని వసతులు ఉన్నాయి. మంత్లీ బేసిస్ లేదా, డైలీ బేసిస్‌లో ఇక్కడ స్పేస్‌ని వినియోగించుకోవచ్చు. కేవలం ఇది వర్క్ స్పేస్ మాత్రమే కాదు.. వేరు వేరు స్టార్టప్స్ మధ్య అనుసంధానం కోసం కూడా వేదికగా ఉపయోగపడుతుంది. స్టార్టప్ సంస్థలు తమ ఆలోచనలతో పెట్టుబడుల కోసం తిరగాల్సి ఉంటుంది. అలాంటి ఇబ్బంది లేకుండా ఇన్వెస్టర్లతో సమావేశాలను సైతం నిర్వహిస్తారు. ప్రపంచ స్థాయి సదుపాయాలతో ఆకట్టుకునే రీతిలో దీనిని ఏర్పాటుచేశారు. త్వరలో మరో హబ్‌ని సికింద్రాబాద్‌లో ప్రారంభించేందుకు యోచిస్తున్నారు నిర్వాహకులు. నిజంగా నగర వాసులకు ఇది మంచి అవకాశమనే చెప్పాలి. మీరూ www.91springboard.com వెబ్‌సైట్‌ని సంప్రదించవచ్చు.

